నమస్తే తెలంగాణ
# నిర్మల్
3 | నిజామాబాద్, ఆదివారం 17 మార్చి 2024 | NIRMAL



ఆదిలాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ మంత్రి రామన్న, ప్రజలు



గుడిహత్నూర్ : నిరసనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్ : బీజేపీ దిష్టిబొమ్మతో బీఆర్ఎస్ మహిళా కార్యకర్త






ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి రామన్న

## కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ..

# జనాగ్రహం



మంచిర్యాల రాస్తారోకోలో నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

## తెలంగాణ ఆడబిడ్డపై ఈడీ దాడులు చేయడంతో అట్టుడికిన జిల్లా..

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, జాగృతి శ్రేణుల ఆగ్రహజ్వాల
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు..
- ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం..
- నల్లబ్యాడ్జీలు ధరించి, నల్లజెండాలు చేతబూని నిరసన..
- రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుట్ర అని మండిపాటు
- కేంద్ర ప్రభుత్వం, ఈడీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్.. మాజీ ఎమ్మెల్యేలు రామన్న, దివాకర్‌రావు, చిన్నయ్య

ఆదిలాబాద్, మార్చి 16(నమస్తే తెలంగాణ) : భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) నాయకురాలు, ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్.. మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు, జాగృతి శ్రేణులు, ప్రజలు ఆందోళన బాట పట్టారు. ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి పార్టీ కార్యాలయం నుంచి తెలంగాణ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కేంద్ర వైఖరిని నిరసిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. గుడిహత్నూర్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు రాస్తారోకో నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్, భారత జాగృతి శ్రేణులు రాస్తారోకో చేపట్టాయి. చెన్నూర్, మందమర్రిలో కూడా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు నల్ల జెండాలను పట్టుకుని నిరసన తెలిపారు. జైనూర్, తిర్యాణి మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

### బడే భాయ్.. ఛోటా భాయ్ కుట్రలు

ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు సంబంధించిన బడే భాయ్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఛోటా భాయ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు కలిసి కుట్రలు చేస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పార్లమెంట్ ఎన్నికల ముందు ఇద్దరు నేతలు బీఆర్ఎస్ పార్టీని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారు. కేంద్ర దర్యాప్తుసంస్థలు సీబీఐ, ఈడీ, ఐటీలు బీజేపీ నాయకుల కనుసన్నల్లో పనిచేస్తున్నాయని ఆరోపించారు. విచారణ పేరిట వచ్చిన అధికారులు కవితను ఎందుకు అరెస్ట్ చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పలను కేంద్ర సంస్థలు ఎందుకు అరెస్ట్ చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. **- మాజీ మంత్రి జోగు రామన్న**

### బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు..

ఈడీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ కవితను మహిళా అని చూడకుండా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. మోదీ పాలనలో దేశంలో మహిళలు ఏ మాత్రం గౌరవం లేకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు అక్రమ అరెస్టులకు భయపడరని, కవిత నిర్దోషిగా బయటకొస్తారని తెలిపారు. ప్రతిపక్షాలపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు రాబోతున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారని తెలిపారు. **- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

### హక్కులను కాలరాస్తోంది..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోంది. దర్యాప్తు సంస్థలను తొత్తులుగా మార్చుకొని బీఆర్ఎస్ పార్టీని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నది. ఇందులో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసింది. బీజేపీ, కాంగ్రెస్ కలిసి ఈ ఎత్తుగడలు వేస్తున్నాయి. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ రాజకీయ కుట్రగానే భావిస్తున్నాం. కేసీఆర్ కుటుంబంపై కక్షసాధింపులకు పాల్పడితే బెదిరే ప్రసక్తి లేదు. **-కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే**

### నిరంకుశ విధానానికి నిదర్శనం..

దేశంలోని బీజేపీ నిరంకుశ విధానానికి ఇది నిదర్శనం. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ వెనుక రెండు జాతీయ పార్టీల కుట్ర ఉంది. సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉండగా, ఇలా అదుపులోకి తీసుకోవడం సరికాదు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టే ప్రయత్నం కేంద్రం చేస్తున్నది. బీజేపీ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు. **- దివాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే(మంచిర్యాల)**

### ఇబ్బంది పెట్టడమే పని..


ప్రతిపక్షపార్టీలను ఇబ్బంది పెట్టడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిగా పెట్టుకుంది. బీజేపీలో చేరిన వారికి కేసులు మాఫీ చేస్తున్నది. రాష్ట్రం కోసం ఉద్యమించిన కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బంది పాలు చేయడమే పనిగా పెట్టుకుంది. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ హేయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై కుటిల రాజకీయాలు చేస్తున్నాయి. **-దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే(బెల్లంపల్లి)**



బెల్లంపల్లి : రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ శ్రేణులు



చెన్నూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు



ఈడీ, మోడీ డౌన్ డౌన్



జైనూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు



మందమర్రి : రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, మహిళలు

## పార్లమెంట్ ఎన్నికల
# షెడ్యూల్ విడుదల

**ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది..**

ఎదులాపురం, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిందని, పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులను తొలిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో పార్లమెంట్ ఎన్నికలపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తక్షణమే స్పందించాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటుతోపాటు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలను తక్షణమే ప్రారంభించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్‌తోపాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను మీడియాతోపాటు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ వీసీలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.



జిల్లాలో వీడియోకాన్ఫరెన్స్‌లో హాజరైన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ, ఐటీడీవో పీవో, అదనపు కలెక్టర్



బస్‌డిపో వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

## అదనపు బస్సులు నడపాలని ధర్నా

నిర్మల్ అర్బన్, మార్చి 16 : సారంగాపూర్ మండలంలోని మలక్‌చించోలికి అదనపు ఆర్టీసీ బస్సును నడిపించాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. 30 మంది మహిళలు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమ గ్రామానికి రోజుకు నాలుగు ట్రిప్పులే నడిపిస్తున్నారని, ఏడు ట్రిప్పులు నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ మెంబర్ నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సన్మార్గంలో నడవాలి..

**- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

జైనథ్, మార్చి 16 : సమాజంలో ప్రతి ఒక్కరూ తమకున్న చెడు వ్యసనాలను వీడి సద్గురు బ్రహ్మ నిష్ట బాజీరావ్ బాబా చూపిన సన్మార్గంలో నడవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మేడిగూడ(ఆర్) గ్రామంలో వారం రోజులుగా జరుగుతున్న బాజీరావ్ బాబా సప్తాహం ముగింపు వేడుకలకు హాజరై మాట్లాడారు. బాజీరావ్ బాబా చిత్రపటం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుభాష్, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్, వీడీసీ అధ్యక్షుడు రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కడెం నీటిపారుదల శాఖ
# ఉద్యోగి రాకేశ్ మృతి

- పై అధికారుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ దవాఖానలో తుదిశ్వాస

జన్నారం/కడెం, మార్చి 16: జన్నారం మండల కేంద్రానికి చెందిన తోకల రాకేశ్ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేయగా, కరీంనగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రాకేశ్ కడెం ప్రాజెక్టు నీటి పారుదలశాఖ కార్యాలయంలో జూనియర్ టెక్నికల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. అదే కార్యాలయంలో సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తనను వేధిస్తున్నారని శుక్రవారం తల్లి సరస్వతి, తమ్ముడు విశేష్‌కు చెప్పుకొని బాధపడ్డాడు. కాసేపటికే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జన్నారంలో ప్రాథమిక చికిత్స అందించి, కరీంనగర్ దవాఖానకు తరలించారు. జన్నారం పోలీసులు కరీంనగర్‌లోని దవాఖానకు చేరుకొని రాకేశ్ వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ బిక్లాల్‌నాయక్ తెలిపారు. కాగా, రాకేశ్ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. రాకేశ్ తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు పై అధికారులు ప్రభాకర్, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు జన్నారం అదనపు ఎస్ఐ మృత్యుంజయ సర్కార్ తెలిపారు. రాకేశ్ మృతదేహాన్ని లక్షెట్టిపేటకు తరలించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. సీఐ నరేందర్, జన్నారం ఎస్ఐ సతీశ్ అక్కడికి చేరుకున్నారు. బాధ్యులైన అధికారులను కఠినంగా శిక్షించాలని కుటంబ సభ్యులు డిమాండ్ చేశారు. కాగా, రాకేశ్ తండ్రి సురేశ్ రెండు నెలల క్రితమే గుండెపోటుతో మృతి చెందాడు.



తోకల రాకేష్(ఫైల్)

## బొలేరో కింద పడి
# పాప దుర్మరణం

దిలావర్‌పూర్, మార్చి 16 : కంజర్ గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ సాధిక్ కూతురు 15 నెలల పాప అనయ ఫాతిమా రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఎస్ఐ సుమాంజలి వివరాల ప్రకారం.. అదే గ్రామంలో బొలేరో (టీఎస్ 01 యూఏ 2191) వాహనం ద్వారా గ్యాస్ సిలిండర్‌లను సప్లయ్ చేస్తున్నారు. గ్రామంలోని మూల మలుపు వద్ద ఫాతిమాతోపాటు పిల్లలు ఆడుకుంటున్నారు. అటువైపుగా వెళ్తున్న వాహనం వేగంగా ఉండడం, డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా, అజాగ్రత్తతో నడుపడంతో వాహనం వెనుక టైరు కింద ఫాతిమా పడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వాహన డ్రైవర్ శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



చిన్నారి అనయ ఫాతిమా